సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 16 । డిసెంబర్ । 2023



కిరాయి పేరుతో మోసం

కార్లు అద్దెకు కావాలంటూ ఓ మోసగాడు కార్ల యజమానులకు టోకరా వేసిన సంఘటన గుర్రంకొండలో చోటుచేసుకుంది. -8లో



కేజీబీవీ విద్యార్థిని మృతి

నిమ్మనపల్లె మండలం ముష్ఠూరు కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థిని అనారోగ్యంతో బాధ పడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.220
రెండోరకం	రూ.80	రూ.158



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 367 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	472
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 806.380 కిలోలు

న్యూస్‌రీల్

నేడు డీఆర్‌డీఓ డైరెక్టర్ రాక

కురబలకోట: భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) డైరెక్టర్(విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ) మేజర్ జనరల్ ఎంకే హడ శనివారం అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు విచ్చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ శుక్రవారం తెలిపారు. కళాశాలలో జరిగే ప్రెషర్స్‌డేకు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన సందేశంతోపాటు విద్యార్థుల ఆట పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సురక్షితం



చికిత్స పొందుతున్న మహిళతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కొండయ్య

సంబేపల్లె: ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సురక్షితమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య తెలిపారు. సంబేపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకునేలా సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మధుసూదన్‌రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ప్రోత్సాహం కోసం దరఖాస్తు చేసుకోండి

రాయచోటి టౌన్: యూపీపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ 2023 అర్హత సాధించిన అభ్యర్థులు జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రిలిమ్స్ అండ్ మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన ఏపీకి చెందిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రిలిమినరీలో క్వాలిఫై అయిన వారికి రూ.1 లక్ష, మెయిన్స్‌లో క్వాలిఫై అయిన వారికి రూ.50 వేలు ప్రోత్సాహం అందించడం జరుగుతుందని తెలిపారు. jnanabhumi.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నూతన నియామకం



రాంప్రసాద్‌రెడ్డి

పుల్లంపేట: గుంతకల్ డివిజన్ పరిధిలో రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా పుల్లంపేటకు చెందిన రాచమల్లు రాంప్రసాద్ రెడ్డి నియమితులయ్యారు. ఈయన బీజేపీ కిసాన్ మోర్చా సోషల్ మీడియా రాష్ట్ర కో-కన్వీనర్‌గా పని చేస్తున్నారు. 31 డిసెంబర్, 2024వ తేదీ వరకు ఆయన ఆర్‌యూసీసీ సభ్యుడిగా కొనసాగుతారు.

పీఎల్ఐలో స్టేట్‌ఫస్ట్



రాపూరి రెడ్డిశేఖర్

పెద్దతిప్పసముద్రం: అన్నమయ్య జిల్లాలోని పెద్దతిప్పసముద్రం సబ్-పోస్ట్‌మాస్టర్ రాపూరి రెడ్డిశేఖర్‌కు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయించడంలో రాష్ట్రంలోనే మొదటి స్థానం దక్కింది. ఈ మేరకు రాష్ట్ర తపాలా శాఖ ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం ఆయనకు సమాచారం అందింది. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ తపాలా జీవిత బీమాకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంతో ఈ అవార్డు దక్కింది. ఈ నెల 21న విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఎస్‌పీఎం రెడ్డిశేఖర్‌కు ఏపీ పోస్టల్ ఎక్సెలెన్సీ అవార్డును ఏపీ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ చేతుల మీదుగా అందజేయనున్నారు.

ఫలితాల విడుదల

పులివెందుల రూరల్: పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం బీటెక్ కోర్సుకు సంబంధించి సెమిస్టర్, సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ఆర్.రమణారెడ్డి తెలిపారు. పూర్తి వివరాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

22న జాబ్‌మేళా

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంబాషా తెలిపారు. జేకేసీ ఆధ్వర్యంలో టెక్ సేవా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించే ఈ డ్రైవ్‌లో 15 మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 10 తరగతి మొదలు డిగ్రీ వరకు చదువుకున్నవారంతా ఈ డ్రైవ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9849022809, 9059066031 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇంటి ముంగిటకే వైద్యం

- 104 వాహనం ద్వారా సేవలు
- జిల్లాలో 14,03,977 మందికి అందిన వైనం
- ఉచితంగా మందులు, 10 రకాల పరీక్షలు
- ప్రజలతో మమేకమవుతున్న వైద్యులు, సిబ్బంది



రామాపురం మండలం పోతుకూరుపల్లెలో వైద్య సేవలు అందిస్తున్న 104 వాహన సిబ్బంది

బి.కొత్తకోట: ప్రభుత్వం 104 వాహనం ద్వారా వైద్య సేవలను రోగుల ఇంటి ముంగిటకే తీసుకెళ్తోంది. ఫలితంగా అన్నమయ్య జిల్లాలో వైద్య సేవలు పొందుతున్న వారిసంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వేల రూపాయలు ఖర్చు చేసే పరిస్థితి నుంచి వైద్యం, మందులు, రక్త, వ్యాధి నిర్ధారణ పరీక్షలన్నీ ఉచితంగా చేయిస్తోంది. పేదలపై ఆర్థికభారాన్ని తప్పించింది. వైద్యం కోసం పల్లె నుంచి పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేసిన ప్రభుత్వం తమకు అండగా నిలుస్తోందని రోగులు అంటున్నారు. ఈ వైద్యసేవలు పొందుతున్న రోగుల సంఖ్య ప్రతి నెలా పెరుగుతుండగా, అందుకు తగ్గట్టుగా సేవలు అందిస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ద్వారా..

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ద్వారా గ్రామీణ పేదలందరికీ ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 375 ఉన్నాయి. వీటి పరిధిలో 104 వాహనం ఒక నెలకు 2 లేదా 3 సార్లు ప్రణాళిక ప్రకారం వైద్యసేవలు అందిస్తాయి. జిల్లాలో 104 వాహనాలు 32 ఉన్నాయి. ఇవి తమ పరిధిలోని సచివాలయాల్లో నిర్ణయించిన సమయాల్లో వెళ్లి గ్రామీణ రోగులకు సేవలు అందిస్తాయి. ఏరోజు ఏ గ్రామంలో వైద్య సేవలు అందిస్తారో ముందుగా సమాచారం తెలియజేస్తారు. తర్వాత వెళ్లిన వైద్యులు అవసరమైన పరీక్షలు నిర్వహించి వైద్యం అందించి మందులు పంపిణీ చేస్తారు. వాహనం వచ్చే రోజు కోసం రోగులు ఎదురుచూసే పరిస్థితి తీసుకొచ్చారు. ఇంటివద్దకే సేవలు అందుతుండటంతో పేదలు 104తో అనుబంధం పెంచుకున్నారు. వైద్యులు పరీక్షలు నిర్వహించడమేకాక దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్సలు, మందులు అందజేస్తుండటంతో పేదలకు ఎన్నో ఇబ్బందులు తీరుతున్నాయి. ఉన్న గ్రామం నుంచి పట్టణాలకు వెళ్లి వైద్యం కోసం ఆస్పత్రుల్లో ఎదురుచూడటం, మందులకు, రాకపోకలకు ఇతర వాటికి ఖర్చులు భరించాలి. ఈ వ్యయప్రయాసాలన్నీ దూరమై ఇంటివద్దకే వైద్య సేవలు అందుతున్నందున రోగులు అత్యవసరమైతే కానీ పట్టణాలకు రావడం తగ్గింది.

11.75 లక్షల మందికి సేవలు

2023-24 ఏడాది, 2023-24లో డిసెంబర్ 14 నాటికి జిల్లాలో 11,75,039 మంది రోగులు 104 ద్వారా వైద్యసేవలు అందాయి. 2022-24లో 4,33,764 మంది వైద్యసేవలు పొందగా అందులో మహిళలు 2,39,921 మంది, పురుషులు 1,93,843 మంది ఉన్నారు. 2023-24 డిసెంబర్ 14 నాటికి మొత్తం 9,37,660 మంది వైద్యం పొందగా అందులో మహిళలు 5,07,838 మంది, పురుషులు 4,29,822 మంది ఉన్నారు. పల్లెల్లో 104 వైద్యసేవలు పొందుతున్న వారిలో అత్యధికులు మహిళలే. వైద్యసేవలు పొందిన వారిలో ఒకటికి మించి పరీక్షలు చేయించుకున్న వారిసంఖ్య అధికం. అవసరమైన వారికి అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తుంటారు. 104 ద్వారా 10 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారు.

మంచాన పడ్డ వారికి..

ఇళ్ల నుంచి బయటకు రాలేనిస్థితిలో మంచానికే పరిమితమైన రోగుల వద్దకే వైద్యులు వెళ్తున్నారు. జిల్లాలో 2022-23లో 20,798 మంది, 202-24 డిసెంబర్ 14 నాటికి 11,755 మంది రోగులకు డాక్టర్లు వారి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యం అందించారు.

రెండేళ్లలో సేవలు పొందిన వారి సంఖ్య

సేవలు	2022-23	2023-24
మందులు	4,33,764	9,37,660
బాలింతలు	8,475	19,327
చిన్నపిల్లలు	25,967	27,118
మంచాన పడ్డవారు	20,798	11,755
జ్వరాలు	1,34,738	3,56,309
చక్కెర వ్యాధి	1,23,313	2,30,813
10 రకాల పరీక్షలు	2,61,059	5,29,717



భారం తగ్గింది



12 కిలోమీటర్ల దూరంలోని తంబళ్లపల్లెకు వెళ్లి బీపీకి చికిత్స మందులు కొనుగోలు చేసి వచ్చేవాడిని. ఇప్పుడు 104 వాహనం వస్తుండటంతో బాధలు తప్పాయి. మూడేళ్లుగా బీపీతో బాధపడుతున్నా. ఇప్పుడు ఇంటి వద్దకే వైద్యులు వచ్చి చికిత్స అందిస్తున్నారు. మందులు ఉచితంగా ఇస్తున్నారు. దీనివల్ల నాకు నెలకు రూ.300 నగదు, సమయం ఆదా అవుతోంది.

-జి.నరసింహులు నాయుడు, మర్రిమాకులపల్లె, తంబళ్లపల్లె

సంతృప్తిగా ఉంది



104 ద్వారా గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందించడం సంతృప్తి ఇస్తోంది. గ్రామాల్లో పేదలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 104 ద్వారా.. వైద్యులు పేదలకు వైద్యం అందించే బాధ్యతలు అప్పగించడం ఆనందం కలిగిస్తోంది. వైద్యం కోసం డబ్బు ఖర్చు చేయలేని స్థితిలోని పేదలకు వైద్యం అందించడం సంతృప్తి కలిగిస్తోంది. ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యాన్ని పేదలకు అందించడం బాధ్యతగా భావించాలి.

-డాక్టర్ శంకర్, కందుకూరు పీహెచ్‌సీ, పెద్దతిప్పసముద్రం

సేవల విస్తరణ



104 ద్వారా వైద్య సేవలను ప్రభుత్వ విస్తరిస్తోంది. గతేడాది కంటే ప్రస్తుత ఏడాది అత్యధిక సంఖ్యలో రోగులకు వైద్యసేవలు అందించడం జరిగింది. ప్రభుత్వం వైద్యుల ద్వారా చికిత్సలు, పరీక్షలు, ఔషధాలు అన్నీ ఉచితంగానే అందిస్తోంది. ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్తుండటంతో ప్రజల్లో ఆదరణ పెరిగింది.

-ఎస్.ప్రవీణ్‌కుమార్, 104 జిల్లా మేనేజర్

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆయాలు చేస్తున్న దీక్షలపై స్పందిస్తూ ఆయన శుక్రవారం రాయచోటిలో ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ హయాంలో అంగన్‌వాడీ వర్కర్లకు రూ. 7 వేల జీతం ఉండగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మరుసటి నెలలోనే రూ.11500కు, హెల్పర్ల (ఆయాల)కు రూ.4500 నుంచి రూ.7 వేలకు పెంచినట్లు పేర్కొన్నారు. ఉత్తమ సేవలందిస్తున్న వర్కర్లు, హెల్పర్లకు ప్రోత్సాహంగా నెలకు రూ.500 చెల్లిస్తున్నట్లు తెలిపారు. గరిష్ట వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు తమ సర్వీసు చివరి నాటికి రూ.50 వేల బెనిఫిట్‌ను లక్ష రూపాయలకు, హెల్పర్లకు రూ.20 వేల నుంచి రూ.40 వేలకు పెంచడంపై సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. హెల్పర్లకు అంగన్‌వాడీ వర్కర్‌గా అవకాశం కల్పించేందుకు గరిష్ట వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచడం, టీఏ, డీఏలను రాష్ట్ర ప్రభుత్వం నుంచి చెల్లించడం, 2013 నుంచి అంగన్ వాడీలకు పదోన్నతులను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ప్రమోషన్లు కల్పించి 560 గ్రేడ్ 2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేసిందన్నారు. వర్కర్లు, హెల్పర్లకు ఈ ఏడాది నుంచి ప్రమాద బీమా రూ.2 లక్షల వరకు చెల్లిస్తుండడం జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఎన్నికల సమయంలో జీతాలు పెంచి పబ్బం గడుపుకునే మనస్తత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదన్నారు. ఎన్నికలు అయిన తరువాత మంచి చేయాలని చూసే గొప్ప మనస్తత్వమున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కొంత మంది ప్రభుత్వంపై బురద జల్లుతూ రెచ్చగొడుతున్నారని, అవన్నీ నమ్మవద్దని కోరారు. అంగన్‌వాడీలందరూ మంచి ఆలోచన చేసి ప్రభుత్వానికి సానుకూలంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు చర్యలు



రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి: ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సాధారణ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని, ఇందుకు రాజకీయ పార్టీల నాయకులందరూ సహకరించాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి మరింత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్ జాబితాకు సంబంధించి వచ్చిన క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పక్కాగా పరిశీలించడం జరుగుతోందని, జిల్లాలో ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన దాదాపు పూర్తయిందని, తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్ష

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, రామకృష్ణారెడ్డి, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి ట్రాన్స్‌పోర్ట్ అధికారి దినేష్ చంద్ర, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, ఆర్టీసీ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

ఆంధ్ర రాష్ట్ర సాధనకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగం మరువలేనిదని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ అధికారి సందప్ప, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలకు ఆకేపాటి పాదయాత్ర ప్రారంభం



రాజంపేటలో ఆకేపాటి అమరనాథరెడ్డి పాదయాత్ర దృశ్యం

రాజంపేట: జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తిరుమలకు అన్నమయ్య కాలిబాటలో 21వ సారి మహా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం సాయంత్రం ఆకేపాడు ఆలయాల నుంచి ప్రారంభించారు. ఆయన వెంట గోవింద భక్తులు శ్రీ వెంకటేశ్వరస్వామిపై కీర్తనలు ఆలపిస్తూ ముందుకు సాగారు. ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్ రెడ్డి నేతృత్వంలో పాదయాత్ర కొనసాగింది. కోలాటలు, భజనలు, గోవింద నామస్మరణతో మార్మోగింది. అన్నమయ్య కీర్తనలతో ఆద్యంతం భక్తిభావంతో కొనసాగింది. ఉత్సాహ భరితంగా బాణసంచాలు కాల్చారు.

శ్రీనివాసుని ఊరేగింపు

పాదయాత్రలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ఊరేగింపు చేపట్టారు. పాదయాత్ర పట్టణంలోకి ప్రవేశించిన తర్వాత పండరి భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ తనయుడు కొండూరు విజయ్‌రెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి బావమరిది మదన్‌రెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు.

పాదయాత్ర సాగిందిలా..

రాజంపేట పట్టణంలోని మార్కెట్ సర్కిల్, పాత బస్టాండు సర్కిల్‌లో ఆకేపాటిని పలువురు గజమాలతో సత్కరించారు. ఏఐటీఎస్ సర్కిల్‌లో ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి, ఎంజీపురంలో సీనియర్ న్యాయవాది కొండూరు శరత్‌కుమార్‌రాజు, యల్లమ్మగుడి వద్ద మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా రమణారెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు కూండ్ల రమణారెడ్డి, రాము యాదవ్, టీటీడీ చైర్మన్ సోదరుడు భూమన శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పాపినేని విశ్వనాథరెడ్డి, గోపిరెడ్డి, అరిగెమణి, భాస్కర్‌రాజు, సౌమిత్రి, విశ్వనాథరాజు, జెడ్పీటీసీలు గడికోట ఉషాసుబ్బారెడ్డి, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వజన్మ సుకృతం

21వ సారి అన్నమయ్య కాలిబాటలో నడిచి శ్రీవారి దర్శనం చేసుకోవడం నా పూర్వజన్మ సుకృతం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి బీజం పడింది. సీఎం వైఎస్ జగన్‌కు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు కలగాలని ప్రార్థిస్తున్నాను. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని శ్రీవారిని కోరుకుంటున్నాను.

-ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్

జీవాల పెంపకానికి చేయూత

- రూ.కోటి రుణం, రూ.50 లక్షల సబ్సిడీ
- అన్ని సామాజిక వర్గాల వారూ అర్హులే
- యువతకు లభిస్తున్న ఉపాధి
- పెరిగిన మాంస ఉత్పత్తులు



రాయచోటి నియోజకవర్గ పరిధిలో జీవాలు పెంచుతున్న దృశ్యం

రాయచోటి: గొర్రెలు, మేకల పెంపకందారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహం అందిస్తున్నాయి. ఉపాధి కోసం ఎదురుచూస్తున్న వారికి నేషనల్ లైవ్ స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) ద్వారా ఓ పథకాన్ని తీసుకొచ్చాయి. గొర్రెలు, మేకల పెంపకంపై ఆసక్తి ఉన్న ఎవరైనా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యక్తిగతంగా కానీ, సామూహికంగా కానీ, సహకార సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, స్వయం సహాయక సంఘాలు ఇలా అన్ని రకాల వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో చాలా మందికి ఈ పథకంపై అవగాహన లేకపోవడంతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. 2021-22లో ప్రారంభమైన ఈ పథకం 2026-27 ఆర్థిక సంవత్సరం వరకు అమల్లో ఉంటుంది.

యూనిట్ వివరాలు

కనిష్టంగా 100 గొర్రెలు, 5 పొట్టేళ్లు.. గరిష్టంగా 500 గొర్రెలు లేదా 25 పొట్టేళ్లను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఇందులో ఏ యూనిట్‌కైనా సబ్సిడీ వర్తిస్తుంది. ఇందులో పునరుత్పత్తి కోసం మాత్రమే జీవాలను పెంచాల్సి ఉంటుంది. పొట్టేళ్లు లేదా మేక పోతుల పెంపకానికి మాత్రమే అయితే వర్తించదు. సబ్సిడీ విడుదల కావడానికి 2 నెలల నుంచి 6 నెలలు పట్టవచ్చు. ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం సబ్సిడీని (గరిష్టంగా రూ.50 లక్షలు) రెండు విడతలుగా మంజూరు చేస్తారు. 500 గొర్రెలు లేదా మేకల యూనిట్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి మొదటి దశలో 50 శాతం (రూ.25 లక్షలు) ప్రాజెక్టు చివరి దశలో మిగతా 50 శాతం (రూ.25 లక్షలు) అందజేస్తారు.

ఎంపిక చేసుకునే జీవాలు

గొర్రెలు లేదా మేకల పెంపకానికి అందరూ అర్హులే. ఇందులో కుల, మతాల ప్రస్తావన లేదు. అయితే పశుపోషణపై కొంత అవగాహన ఉండాలి. ఈ పథకం ద్వారా యూనిట్‌ను ప్రారంభిస్తే సాంకేతిక సలహాదారుగా అనుభవజ్ఞులైన పశువైద్య సిబ్బంది ఒకరిని నియమించుకోవాలి. నూతన సాంకేతిక విధానం ద్వారా జీవాలను పెంచాల్సి ఉంటుంది. ప్రభుత్వం గుర్తించిన 44 గొర్రె జాతులు లేదా 38 మేక జాతుల్లో వేటినైనా ఎంపిక చేసుకోవచ్చు. ఈ విషయం ప్రాజెక్టు రిపోర్టులో తెలియజేయాల్సి ఉంటుంది.

ఎంత భూమి కావాలంటే..

100 నుంచి 500 జీవాల వసతి కోసం అర ఎకరం పొలం ఉండాలి. దీనికి అదనంగా అక్కడే పశుగ్రాసం పెంపకం కోసం 5 నుంచి 10 ఎకరాల భూమి అవసరం. భూమి సొంతం కాకపోయినా లీజుకు తీసుకున్నా సరిపోతుంది. అయితే కచ్చితంగా నీటివసతి ఉండాలి. ఈ పథకంపై ఆసక్తి గల వారు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే స్థానిక పశు సంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.


దరఖాస్తుకు కావాల్సిన డాక్యుమెంట్లు

- డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)
- దరఖాస్తుదారుని ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, అడ్రస్ ప్రూఫ్
- బ్యాంకు అకౌంట్ వివరాలు
- జీవాల పెంపకంపై అనుభవం ఉన్నట్లు స్థానిక పశువైద్యాధికారి నుంచి ధ్రువీకరణపత్రం
- భూమికి సంబంధించిన పత్రాలు
- గ్రూప్ సభ్యులు కలిసి యూనిట్ ప్రారంభించాలనుకుంటే సభ్యులందరి వివరాలు

గొర్రెలు లేదా మేకల యూనిట్ వివరాలు

యూనిట్	బ్యాంకు రుణం	సబ్సిడీ
500 గొర్రెలు+25 పొట్టేళ్లు (లేదా)500 మేకలు+25 మేకపోతులు	రూ.కోటి	రూ.50 లక్షలు
400 గొర్రెలు+20 పొట్టేళ్లు (లేదా) 400 మేకలు+20 మేకపోతులు	రూ.80 లక్షలు	రూ.40 లక్షలు
300 గొర్రెలు+15 పొట్టేళ్లు (లేదా) 300 మేకలు+15 మేకపోతులు	రూ.60 లక్షలు	రూ.30 లక్షలు
200 గొర్రెలు+10 పొట్టేళ్లు(లేదా) 200 మేకలు+10 మేకపోతులు	రూ.40 లక్షలు	రూ.20 లక్షలు
100 గొర్రెలు+5 పొట్టేళ్లు(లేదా) 100 మేకలు+5 మేకపోతులు	రూ.20 లక్షలు	రూ.10 లక్షలు

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని గ్రామీణ యువతకు, ఔత్సాహిక రైతులకు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా గొర్రెలు, మేకల యూనిట్‌ల నిర్వహణ కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈ పథకం ద్వారా ప్రభుత్వం గరిష్టంగా రూ.50 లక్షల దాకా సబ్సిడీ ఇస్తుంది.

- గుణశేఖర్‌పిళ్లై, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

సహకారం అందిస్తాం



గొర్రెలు లేదా మేకల యూనిట్ నిర్వహణ కోసం ముందుకొచ్చే గ్రామీణ యువతకు మా వంతు సహకారం అందిస్తాం. దరఖాస్తు చేసుకునే విధానం దగ్గర నుంచి బ్యాంకుల నుంచి రుణం పొందే వరకూ అన్ని విషయాలలో సహకరిస్తాం. ఈ పథకం ద్వారా ఎంతో లబ్ధి పొందవచ్చు. ఉపాధితోపాటు పెద్ద మొత్తంలో సబ్సిడీ కూడా అందుకోవచ్చు.

- ఓబిలి శివశంకర్, దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, కడప, అన్నమయ్య జిల్లాల సమన్వయకర్త

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

గుర్రంకొండ : గుర్రంకొండ తెలుగు జెడ్పీ హైస్కూల్‌కు 8వ తరగతి విద్యార్థి ప్రసన్నకుమార్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రసన్న కుమార్ జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ఎంపికయ్యాడు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన ఏపీ స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున పాల్గొన్నాడు. అండర్-14 విభాగం(సేబర్) వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం, జట్టు విభాగంలో బంగారు పతకాన్ని సాధించినట్లు పీడీ రమేష్ తెలిపారు. అతడిని జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు రాష్ట్రం తరపున ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఇదే పాఠశాలలో చదువుతున్న మరో విద్యార్థి రెడ్డిగోవర్ధన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున నంద్యాలలో నిర్వహించిన ఏపీ స్కూల్‌గేమ్స్ పోటీల్లో (కత్తిసాము) మంచి ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్ పొందాడు. శుక్రవారం ఇద్దరు విద్యార్థులను హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, పీడీ రమేష్, ఉపాధ్యాయులు త్రినాథ్, మదన్మోహన్, రెడ్డిమోహన, జావేద్‌లు అభినందించారు.

కిరాయి పేరుతో ఘరానా మోసం

- అద్దె పేరుతో కార్ల యజమానులకు కుచ్చుటోపీ
- రూ.38 లక్షల విలువచేసే ఎనిమిది కార్లు తీసుకెళ్లిన మోసగాళ్లు
- నిందితుల్లో ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసులు



నిందితుడు, అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకొన్న కార్లను చూపుతున్న పోలీసులు

గుర్రంకొండ : తమకు కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలు ఉన్నాయి, వాటికి అవసరమైన కార్లు అద్దెకు కావాలంటూ ఓ మోసగాడు కార్ల యజమానులకు టోకరా వేసిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో చోటుచేసుకుంది. ఆరుగురు కార్ల యజమానుల వద్ద అద్దె పేరుతో రూ. 38 లక్షల విలువచేసే ఎనిమిది కార్లను తీసుకెళ్లి మరో కొంతమందికి తనఖాకు పెట్టిన మోసగాడిని ఎట్టకేలకు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీకి చెందిన రాళ్లమడుగు సుబ్రమణ్యం (42), సంబేపల్లె మండలం మోటకట్ల పంచాయతీ శంకరాపురంకు చెందిన ఎన్నసాని లోకేష్‌కుమార్ (25) కార్లు అమ్మడం, కొనడం వంటి వ్యాపారం చేస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం కలికిరి పట్టణానికి చెందిన షేక్ ఇమ్రాన్ వద్దకు వీరు ఇద్దరు వెళ్లారు. తమకు ఎంఎం కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఉందని, సదరు కంపెనీ ప్రస్తుతం రాజంపేటలో రోడ్డు పనులతో పాటు హంద్రీనీవా కాలువ పనులు చేస్తోందని నమ్మించారు. ఈ కంపెనీలో పనిచేసే ఇంజినీర్ల రాకపోకల కోసం కొన్ని కార్లు అద్దెకు కావాలని చెపచెప్పారు. ఒక కారుకు నెలకు రూ.30 వేలు అద్దె ఇస్తామని నమ్మించారు. వీరి మాటలు నమ్మిన ఇమ్రాన్ తనతో పాటు తన ఐదుగురు స్నేహితుల దగ్గర ఉన్న ఆరు ఇథియోస్ కార్లు, రెండు ఇన్నోవాలు వారికి అద్దెకు ఇచ్చాడు. నాలుగునెలల పాటు ఇమ్రాన్‌కు వారి స్నేహితులకు అద్దె చెల్లించాడు. ఆ తరువాత అద్దె చెల్లించకపోగా తప్పించుకొని తిరగసాగాడు. మోసగాళ్లు ఇద్దరు ఈ ఎనిమిది కార్లను వైఎస్సార్, చిత్తూరు జిల్లాలో పలువురికి తాకట్టు పెట్టేశారు.

- వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం గంగారపువాండ్లపల్లెకు చెందిన తులసీరెడ్డి అనే వ్యక్తి వద్ద ఒక ఇథియోస్ కారును రూ. 2.90 లక్షలకు తనఖాకు పెట్టారు. అలాగే ఇదే మండలానికి చెందిన కొండ్రెడ్డి అనే వ్యక్తికి మరో ఇథియోస్ కార్లు రూ.5 లక్షలకు తనఖాకు పెట్టారు. అలాగే మహదేవపల్లెకు చెందిన మల్లేశ్వరరెడ్డి అనే వ్యక్తికి మరో కారు రూ. 1.50 లక్షలకు తనఖాకు పెట్టారు. చిత్తూరు జిల్లా సోమల టౌన్‌కు చెందిన హరినాథ్ అనే వ్యక్తికి రూ. లక్షకు మరో కారు తనఖాకు పెట్టారు. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం తిమ్మారెడ్డిగారిపల్లెకు చెందిన నాగేశ్వర్‌రావ్ అనే వ్యక్తికి ఇన్నోవా కారును రూ.1.50 లక్షలకు అలాగే కొండారెడ్డి అనే వ్యక్తికి మరో ఇన్నోవా కారును రూ. 1.50 లక్షలకు తనఖాకు పెట్టారు.

ఈ సంఘటనపై ఇమ్రాన్ అతని స్నేహితులుగుర్రంకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మోసగాళ్లలో ఒకరైన సుబ్రమణ్యంను శుక్రవారం అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు అతని వద్ద నుంచి ఆరు ఇథియోస్, రెండు ఇన్నోవా కార్లను స్వాధీనం చేసుకొన్నట్లు వాల్మీకిపురం సీఐ సురేష్‌కుమార్, గుర్రంకొండ ఎస్ఐ దిలీప్‌కుమార్‌లు తెలిపారు. కాగా ఈ కేసులో మరో మోసగాడు లోకేష్‌కుమార్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.



నవశకం

పిల్లల చదువుకు భరోసా



మాది వాల్మీకిపురం మండలం, చింతపర్తి గ్రామం. భర్త షేక్ కరీముల్లా టైలర్. నాకు ఇద్దరు కుమారులు. రీహాన్, ఇర్ఫాన్. పెద్దబ్బాయి చింతపర్తి మండల పరిషత్ ఉర్దూ పాఠశాలలో 7 వ తరగతి, చిన్నబ్బాయి 4వ తరగతి. భర్త టైలరింగ్ వృత్తి ద్వారా వచ్చే అరకొర ఆదాయంతో జీవనం సాగిస్తున్నాం. ఇలాంటి తరుణంలో పిల్లల చదువుల కోసం గతంలో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. అప్పులు చేసి పిల్లల పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం కొనే వాళ్లం. 'అమ్మ ఒడి' కార్యక్రమాన్ని జగనన్న ప్రారంభించాక, మా పిల్లల చదువులకు భరోసా కల్గింది. పిల్లలను బాగా చదివించుకుంటున్నాం. జగనన్న వెయ్యేళ్లు వర్ధిల్లాలి.

– కుమారుడు రీహాన్‌తో తల్లి నసీమా

సొంతింటి కల సాకారమైంది



ఎంతో కాలంగా సొంత ఇల్లు లేక బాడుగ ఇంటిలో నివాసం ఉంటూ కాలం వెల్లబుచ్చేవాల్లం. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మావూరికి దగ్గరలోనే జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. అలాగే ఇల్లు కట్టుకొనే విధంగా ప్రోత్సహించారు. నేడు సొంత ఇంటిలో ధైర్యంగా జీవనం సాగిస్తున్నాం.

– పిడుగు రమణమ్మ,
ఉర్లగడ్డపోడు, రైల్వే కోడూరు

గంటల వ్యవధిలో ధ్రువపత్రాలు



ధ్రువీకరణ పత్రాలు గంటల వ్యవధిలో వస్తున్నాయి. గతంలో ఒక పత్రం కావాలంటే అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగేవాల్లం. జగనన్న సురక్షలో ఆదాయ ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేయగా వెంటనే మంజూరు చేసి ఇచ్చారు. ఎక్కడికీ తిరగకుండా మా గ్రామంలోనే అందజేయడం సంతోషంగా ఉంది.

– మల్లు పెద్దకొండారెడ్డి,
రాఘవరాజపురం, రైల్వేకోడూరు

వివాహితను వేధించిన వ్యక్తిపై కేసు

బి.కొత్తకోట : వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రశాంత్ శుక్రవారం తెలిపారు. కురబలకోట మండలం సింగన్నగారిపల్లెకు చెందిన విశ్వనాథ్‌కు బి.కొత్తకోట మండలం దిన్నిమీదపల్లెలో పొలం ఉంది. అతని పొలం పక్కనే చౌటకుంటపల్లెకు చెందిన ఓ వివాహిత పొలం ఉండగా అక్కడికి రాకపోకలు సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెను విశ్వనాథ్ వేధిస్తున్నాడన్న బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో కేజీబీవీ విద్యార్థిని మృతి





కేజీబీవీ పాఠశాల సిబ్బందిని విచారిస్తున్న తహసీల్దార్ మంజుల, మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు (ఇన్‌సెట్) మృతిచెందిన స్వాతి

నిమ్మనపల్లె : నాలుగు రోజుల పాటు విద్యాలయంలో అనారోగ్యంతో బాధపడి, మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో కేజీబీవీ పాఠశాల విద్యార్థిని మృతి చెందింది. వివరాలిలా.. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం కొలమానుసపల్లె పంచాయతీ, కల్నాడు గ్రామానికి చెందిన డి.చందు , డి.సుజాత దంపతుల మొదటి కుమార్తె డి.స్వాతి (13) ఈ ఏడాది జరిగిన పాఠశాల అడ్మిషన్లలో భాగంగా నిమ్మనపల్లె మండలం ముష్తూరు కేజీబీవీ పాఠశాలలో ప్రవేశం పొంది 6వ తరగతి చదువుతోంది. బాలిక తల్లిదండ్రులకు ఐదుగురు సంతానం. మదనపల్లె మండలం వలసపల్లె గ్రామంలో అవ్వతాతలైన వెంకటలక్ష్మి, చిన్నకనమన్న వద్ద స్వాతి ఉంటూ చదువుకుంటోంది. మేనమేమ వరప్రసాద్ బాలికకు సంరక్షుడిగా పేర్కొంటూ కేజీబీవీలో చేర్పించాడు. ఈ క్రమంలో బాలిక నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురై జ్వరం, తలనొప్పిబారిన పడింది. విద్యాలయంలోని నర్సు షీబా తాత్కాలికంగా మందులు అందించింది. రెండు రోజులైన నయం కాకపోవడంతో విద్యార్థిని సంరక్షకుడైన వరప్రసాద్‌కు బుధవారం సమాచారం అందించారు. గురువారం ఉదయం కేజీబీవీ పాఠశాలకు వెళ్లి బాలిక స్వాతిని వెంటబెట్టుకుని తీసుకువచ్చాడు. ఇంటికి వెళ్లిన బాలిక కడుపునొప్పి ఉందని చెప్పడంతో పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ బాలికకు స్కానింగ్ చేయాల్సిన అవసరం ఉందని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వెళ్లాల్సిందిగా చెప్పి అక్కడి నుంచి వైద్యులు రెఫర్ చేశారు. అప్పటికే బాలిక పరిస్థితి ఇబ్బంది కరంగా మారడంతో వెంటనే రాత్రి 11 గంటలకు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో విద్యార్థిని స్వాతి మరోసారి రక్తపు వాంతి చేసుకుని, పరిస్థితి విషమంగా మారి ప్రాణాలు కోల్పోయింది.అనంతరం కుటుంబసభ్యులు బాలిక మృతదేహాన్ని స్వగ్రామమైన కల్నాడుకు తరలించారు. బాలిక మృతి విషయమై ఎస్‌ఓ మునివెంకటమ్మను విచారించగా బాలిక గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోందని, మూడవ రోజు కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని తెలిపారు.

పర్యవేక్షణ లోపం

కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ఎస్‌ఓ, వైద్య సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్లే విద్యార్థిని మృత్యువు పాలైనట్లు తెలుస్తోంది. విద్యార్థిని అనారోగ్యం పాలైన వెంటనే స్థానిక ఆస్పత్రికి పంపకపోవడంతో సమస్యను గుర్తించకపోవడంతో పరిస్థితి విషమంగా మారింది. సరైన సమయంలో స్పందించాల్సిన ఎస్‌ఓ, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పాఠశాలలో విద్యార్థినులు పలుమార్లు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల విచారణ

విద్యార్థిని మృతిపై తహసీల్దార్ మంజుల, మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కెఎస్ఎస్ మూర్తి అధికారులతో కలిసి కేజీబీవీ పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల నర్సు షీబాను విచారించారు. ఎస్‌ఓ మునివెంకటమ్మను అడిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తోటి విద్యార్థులతో మాట్లాడారు. విచారణ నివేదికను అధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా

– ముగ్గురికి గాయాలు



గాయపడిన క్షతగాత్రులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి సమీపంలోని ఏటి వద్ద శుక్రవారం ఓ ఆటో బోల్తా పడి ముగ్గురు గాయపడ్డారు. బి.కొత్తకోట నుంచి కర్ణాటక రాష్ట్రం చేలూరుకు ప్రయాణికులతో వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న శివన్న (55)కు బలమైన గాయాలయ్యాయి. పాపమ్మ (68), రామప్ప (70కు స్వల్ప గాయా లు అయ్యాయి. సమాచారం అందుకున్న పీటీఎం 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారికి మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు పోలీసుల నివాళి



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద సెల్యూట్ చేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు, పోలీసు అధికారులు

రాయచోటి : తెలుగు ప్రజలను ఐక్యం చేసేందుకు ప్రాణాలకు తెగించి పోరాటం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములకు జిల్లా పోలీసులు సెల్యూట్‌తో నివాళులు అర్పించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ కృష్ణారావు పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసి తెలుగు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన మరణ త్యాగఫలంగా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి పార్లమెంట్ సాక్షిగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం జరిగిందని ఎస్పీ తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వివి రాజ్ కమల్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అడ్మిన్ ఎం పెద్దయ్య, పోలీసు మోటారు వాహనాల అధికారి ఎస్ మహబూబ్ వలీ, డీపీఓ ఏఏఓ కృష్ణుడు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భయం వీడితే విజయం మనదే

– అవగాహన సదస్సులో సివిల్స్ విజేత బాలలత



మాట్లాడుతున్న సివిల్స్ విజేత ఎం. బాలలత

రాయచోటి అర్బన్ : భయం వీడి పోరాడితే విజయం మనదే అని అఖిల భారత సర్వీసుల విజేత ఎం. బాలలత అన్నారు. శుక్రవారం స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కెరీర్ గైడెన్స్, సివిల్స్‌పరీక్షల అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే మానసిక ధైర్యాన్ని కోల్పోకుండా భయం వీడాలన్నారు. అభ్యర్థులు ఏ స్థాయి పోటీపరీక్ష రాయాలనుకుంటున్నారో వాటి కంటే చిన్న ఉద్యోగాల పరీక్షలకు కూడా హాజరైతే మంచి ఫలితాలను సాధించవచ్చునన్నారు. సిలబస్‌పై స్మార్ట్‌గా ఆలోచించి పరీక్ష ప్రిపరేషన్‌ను రూపొందించు కోవాలన్నారు. ప్రతి అంశంపై సొంతంగా నోట్స్ రాసుకుని సంక్షిప్తత పాటించాలని సూచించారు. సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకుని ఎంచుకున్న సబ్జెక్టుపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో సాయి విద్యాసంస్థల కరస్పాండెంట్ సుబ్బయ్య, ఏడీ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ బాలాజి, వీఆర్ విద్యాసంస్థల చైర్మన్ వీఆర్‌రెడ్డి, హెచ్ఎంలు నరసింహారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాల యాజమాన్యాలు లైసెన్స్ రుసుం చెల్లించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కర్మాగారాల యాజమాన్యాలు 2024వ సంవత్సరానికి సంబంధించి ఈనెల 31వ తేదీలోగా నిర్ణీత లైసెన్స్ రుసుం సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాలని కర్మాగారాల తనిఖీ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. లైసెన్స్ ఫీజుకు సంబంధించి హెడ్ ఆఫ్ అకౌంటు, డీడీఓ కోడ్‌లలో ఎలాంటి మార్పు లేదని, ఫ్యాక్టరీలలో అదనంగా హార్స్ పవర్ బిగించినా, అదనంగా పనివారిని నియమించినా పెరిగిన దాని ప్రకారం ఫీజు చెల్లించాలని తెలిపారు. పరిశ్రమ బదిలీ, పేరు మార్పు ఉన్నట్లయితే లైసెన్స్ బదిలీలకు, సవరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోగా పీఎఫ్ఎంఎస్ ద్వారా చలానా కట్టి ఒరిజినల్ చలానాను పంపించని పక్షంలో లైసెన్స్ రుసుంపై అదనంగా నెలకు రెండు శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలా చెల్లించని వారి లైసెన్స్ రద్దు చేస్తామని, లైసెన్స్ లేకుండా ఫ్యాక్టరీ నడిపితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివరాలకు 91603 83971, 92958 50949 నెంబరులో సంప్రదించాలన్నారు.